# ప్రొద్దుతిరుగుడు సాగు- యాజమాన్య పద్ధతులు



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూఢిల్లీ
( షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక )


## రాస్–కృషి విజ్ఞాన కేంద్రం

వనస్థలి, కరకంబాడి పోస్ట్, రేణిగుంట మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్–517 520
ఫోన్: 0877-2240203, 9492250410, 7981070420
e-mail: rasskvk@gmail.com, website:kvkchittoor.org

# ప్రొద్దుతిరుగుడు సాగు - యాజమాన్య పద్ధతులు

మన రాష్ట్రంలో పండించే నూనె గింజలలో ప్రొద్దుతిరుగుడు చాలా ముఖ్యమైన పంటగా ప్రాముఖ్యత సంతరించుకుంది. మన రాష్ట్రంలో 0.240 లక్షల హెక్టార్లలో పండిస్తున్నారు. ఖరీఫ్ లో వర్షాలు ఆలస్యమైనప్పుడు ప్రత్యామ్నాయ పంటగా మరియు వేసవి కాలంలో కొద్దిపాటి నీటి వసతులు ఉన్నప్పుడు తక్కువ కాలపరిమితి గల ప్రొద్దుతిరుగుడు పంటను సాగు చేసి మంచి దిగుబడులతో పాటు నికరాదాయము పొందవచ్చు. మన దేశంలో ప్రొద్దుతిరుగుడు విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానం మరియు ఉత్పాదకతలో (870 కిలోలు/హెక్టారుకు) 4వ స్థానంలో ఉంది. మన చిత్తూరు జిల్లాలో ప్రొద్దుతిరుగుడు 519 హెక్టార్లలో సాగు చేయబడుతూ దాదాపు 4.15 లక్షల టన్నుల ఉత్పత్తిని మరియు ఎకరాకు 800 కిలోల దిగుబడి నిస్తుంది.

ప్రొద్దుతిరుగుడులో నూనె 49% మరియు మాంసకృత్తులు 22% ఉంటాయి. ఈ నూనెలో లినోలిక్ ఆమ్లం ఎక్కువగా (66%) ఉండుట వలన ఆరోగ్య పరంగా కూడా వేరుశనగ మరియు నువ్వుల నూనె కంటే శ్రేష్ఠమైనది. నూనె తీసిన తరువాత వచ్చిన పిప్పిలో కూడా అధికంగా మాంసకృత్తులు (21%) ఉండుట వలన పశువులు మరియు కోళ్ళ దాణాలో విరివిగా వాడుతున్నారు.

## అనువైన వాతావరణ పరిస్థితులు మరియు నేలలు

ఈ పంట యొక్క ఎదుగుదల 12 గంటల పగటి సమయం ఉన్నట్లైతే అధికంగా ఉంటుంది. వర్షపాతం సమానంగా విస్తరించి, పూత మరియు గింజకట్టు దశలో అధిక వర్షపాతం లేనట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చు.

## నీటిపారుదల క్రింద ఈ పంటను సంవత్సరం పొడవునా పండించవచ్చు

నీరు నిల్వ ఉండని ఎర్ర, గరప, ఇసుక, రేగడి మరియు ఒండ్రు నేలలు ఈ పంట సాగుకు శ్రేష్ఠమైనవి. వర్షాధారంగా పండించేందుకు బరువైన నల్లరేగడి నేలలు, నీటి వసతితో ఉన్నట్లయితే తేలిక నేలలు అనుకూలమైనవి. ఉదజని సూచిక 6.5-8.0 మధ్య ఉన్న నేలలు ఈ పంట సాగుకు అనువైనవి.

## అనువైన సంకరాలు

| హైబ్రిడ్/సంకరాలు | పంట (రోజులు) | దిగుబడి (కి/హె) | నూనె శాతం | ప్రత్యేక లక్షణాలు |
|---|---|---|---|---|
| ఎన్.డి.ఎస్.హెచ్-1012 | 90-95 | 1500-1800 | 40-41 | అధిక దిగుబడి మరియు నూనె శాతం ఎక్కువ |
| ఎన్.డి.ఎస్.హెచ్-1 | 80-85 | 1200-1500 | 40 | తక్కువ కాల పరిమితి మరియు నూనె శాతం ఎక్కువ |
| డి.ఆర్.ఎస్.హెచ్-1 | 90-95 | 1300-1600 | 42-44 | నూనె శాతం ఎక్కువ |
| కె.బి.ఎస్.హెచ్-44 | 92-95 | 1400-1600 | 36-38 | బూడిద తెగులును తట్టుకుంటుంది |
| కె.బి.ఎస్.హెచ్-53 | 95-100 | 1700 | 39 | బూడిద తెగులును తట్టుకుంటుంది |

* అధిక దిగుబడినిచ్చే ప్రైవేట్ హైబ్రిడ్స్ కూడా మార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్నాయి.

### విత్తే సమయము

రబీ కాలంలో నవంబరు-డిసెంబరు మాసాలలో నీటి పారుదల క్రింద సాగు చేసుకోవచ్చు. పుష్పించే దశ మరియు గింజ గట్టిపడే దశలో ఎక్కువ పగటి కాలం (8-10 గంటలు) మరియు సూర్యరశ్మి గింజ ఉంటే బాగా నిండి నూనె శాతం పెరుగుతుంది.

### నేల తయారీ

భూమిని మూడు నుంచి నాలుగు సార్లు దున్ని మెత్తటి దుక్కిని తయారు చేసుకోవాలి. మధ్యస్థ మరియు బరువు నేలలైతే బ్లేడుతో ఒకటి రెండు సార్లు కలియదున్ని తరువాత చదును చేసి ఆ తరువాత బోదెలు వేసి విత్తనం వేయాలి. ఇలా బోదెలు వేయటం వల్ల విత్తనాన్ని నాటేందుకు మరియు మొగ్గ తొడిగే దశలో ఎరువులు పై పాటుగా వేయటానికి వీలుగా ఉంటుంది.

### విత్తన మోతాదు

ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది

### విత్తన శుద్ధి

ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు కిలో విత్తనానికి 2 గ్రాములు క్వింటాల్ (ఇప్రోడియోన్ 25% + కార్బండిజిమ్ 25%) అనే మందుతో విత్తన శుద్ధి చేయాలి.

నెక్రోసిస్ వైరస్ అధికంగా వున్న ప్రాంతాలలో కిలో విత్తనానికి థయోమిథాక్సామ్ (క్రూయిజర్) 4 గ్రాముల మందును లేదా 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తన శుద్ధి చేయాలి.

## విత్తే దూరం

తేలిక నేలల్లో వరుసల మధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 20-25 సెం.మీ. మరియు బరువు నేలల్లో వరుసల మధ్య 60 సెం.మీ. వుండేటట్లు కుదురుకు 2-3 విత్తనాలు నాటాలి. విత్తనం మొలకెత్తిన 15 రోజుల తరువాత కుదురుకు ఆరోగ్యవంతమైన ఒక మొక్కను వుంచి మిగిలిన మొక్కలను తీసివేయాలి.

## ఎరువులు

ఎకరాకు 3 టన్నుల పశువుల ఎరువును విత్తే 15 రోజుల ముందు వేయాలి. భూసార పరీక్ష ఆధారంగా సిఫారసు చేయబడిన మోతాదులో పోషకాలు వాడాలి. భాస్వరం మధ్యస్థం నుంచి అధికంగా ఉన్న నేలల్లో భాస్వరం వేయక పోయినా దిగుబడులు ఏ మాత్రం తగ్గవు. రబీ పంటకు 30 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం (150 కిలోల SSP) మరియు 12 కిలోల పొటాషియం (20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) నిచ్చే ఎరువులను వేయాలి. నత్రజని ఎరువులను విత్తే ముందు సగ భాగం (26 కిలోల యూరియా), మిగతా సగం 2 దఫాలుగా మొగ్గ తొడిగే దశలో (13 కిలోల యూరియా), పువ్వు వికసించే దశలో (13 కిలోల యూరియా) వేసుకోవాలి. గంధకం తక్కువగా ఉన్న నేలల్లో జిప్సం 55 కిలోలు ఎకరాకు వేస్తే నూనె శాతం పెరుగుతుంది. పైరు పూత దశలో 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి లేదా ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 కిలోల చొప్పున బోరిక్ ఆమ్లాన్ని వేస్తే అధిక దిగుబడి పొందవచ్చు.

## నీటి యాజమాన్యం

తేలిక పాటి నేలల్లో 8-10 రోజుల వ్యవధిలో, నల్లరేగడి నేలల్లో 15 రోజుల వ్యవధిలో తడులు పెట్టాలి. మొగ్గ తొడిగే దశ, పువ్వు వికసించే దశ మరియు గింజ కట్టే దశ నీటి తడులకు కీలకమైనది. ఈ దశలలో పంట ఎటువంటి పరిస్థితుల్లోను బెట్టకు గురి కాకుండా చూసుకోవాలి. నీటి లభ్యత తక్కువగా ఉన్నట్లయితే సాలు మార్చి సాలు పద్ధతిలో నీరు పెట్టాలి. దీని వలన నీటి వినియోగ సామర్థ్యం పెరుగుటయే కాకుండా స్క్లిరోషియమ్ తెగులు వ్యాప్తిని కూడా అరికట్టవచ్చు.

### కలుపు నివారణ, అంతర కృషి

పెండిమిథాలిన్ 5 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు గాని పిచికారి చేయాలి. పంట విత్తిన 25-30 రోజుల తరువాత గొర్రు / గుంటక / దంతితో అంతర సేద్యం చేయాలి.

### పంట మార్పిడి

చిరుధాన్యాలు (జొన్న, సజ్జ), అపరాలు (కంది, మినుము), వేరుశనగ మొదలగు పంటలలో పంట మార్పిడి చేయాలి.

## సస్యరక్షణ

### పచ్చ దీపపు పురుగులు

దీపపు పురుగులు ఆశిస్తే ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి, పూర్తిగా ముడుచుకొని దోనెలు లాగా కనిపిస్తాయి. వాతావరణంలో ఉష్ణోగ్రతలు 30$^{0}$ సెంటిగ్రేడ్ కంటే ఎక్కువైనపుడు మరియు పైరు బెట్టకు గురైనపుడు వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించాలి.

### తెల్లదోమ

తెల్లదోమ ఆకుల అడుగు భాగాన రసాన్ని పీల్చడం వలన మొక్కలు గిడసబారి పోతాయి. వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువైనపుడు వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ట్రైజోఫాస్ 2.5 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించాలి.

### తామర పురుగులు

ఆకులు, పువ్వుల నుంచి రసాన్ని పీలుస్తాయి. నెక్రోసిస్ వైరస్ తెగులును పరోక్షంగా వ్యాప్తి చేసి నష్టాన్ని కలుగ చేస్తాయి. వాతావరణంలో ఉష్ణోగ్రతలు బాగా పెరిగినపుడు ఈ పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు థయోమిథాక్సామ్ 3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రైడ్ 5 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. అలాగే ఇమిడాక్లోప్రైడ్ 0.4 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.

### పొగాకు లద్దె పురుగు

గుంపులుగా ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటాయి. దీని వలన ఆకులు జల్లెడ ఆకులుగా మారుతాయి. పంట 30 రోజుల దశ నుంచి ఈ పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు నివారణకు నోవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా 0.3 మి.లీ. స్పైనోసాడ్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### బీహారీ గొంగళి పురుగు

పురుగులు ఉధృతంగా ఆశిస్తే మొక్కలు మోడు బారిపోతాయి. పుష్పించే దశలో ఎక్కువగా ఆశిస్తుంది. క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. డైక్లోరోవాస్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించాలి.

### శనగ పచ్చ పురుగు

లార్వాలు పువ్వులు, గింజల మధ్యన చేరి వాటిని తింటూ అధిక నష్టాన్ని కలుగజేస్తాయి. పుష్పించే దశలో ఆశిస్తుంది. నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు

ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి, ఆకులు మాడిపోయినట్లు అవుతాయి. పైరు 25 రోజుల నుంచి 65-70 రోజుల వరకు ఈ తెగులు ఆశించి నష్టం కలుగచేస్తుంది. ప్రొపికొనజోల్ 25% ఇసి 1 మి.లీ నీటికి కలిపి పిచికారి చేసి నివారించాలి.

### బూడిద తెగులు

ఆకులపై, అడుగుభాగాన బూడిద లాంటి పొడి కప్పబడి ఉంటుంది. తేమ తక్కువగా ఉండే వేడి వాతావరణంలో తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నివారణకు డినోక్యాప్ 1 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### నెక్రోసిస్ తెగులు

ఆకులు సరిగా పెరగక గిడస బారి పోతాయి. పువ్వులు సరిగా విచ్చుకోక మెలిక తిరిగి వంకరగా మారుతాయి. ఈ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

విత్తన శుద్ధి చేయాలి. పార్థీనియం కలుపును నివారించాలి. ఇమిడాక్లోప్రిడ్ 4.0 మి.లీ./ 10 లీటర్ల నీటికి లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి రెండు సార్లు పిచికారి చేయాలి.

**పువ్వు (తల) కుళ్ళు**

పువ్వు కింద భాగం నీటిలో తడిచినట్లు ఉండి తర్వాత గోధుమ రంగుకు మారుతుంది. పూత దశలో ఎక్కువగా వర్షాలు పడినప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది. ఫెంథియాన్ 1 మి.లీ. మరియు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి పువ్వు దశలో 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**త్రుప్పు తెగులు**

ఆకులపై చిన్న ఇటుక వర్ణపు పొక్కులుగా ఏర్పడి తర్వాత పై ఆకులకు, పువ్వులోని పచ్చ భాగాలకు వ్యాపించి ఎరుపు రంగుకు మారిపోతుంది. చలికాలంలో ఈ తెగులు తీవ్రత అధికంగా ఉంటుంది. కిలో విత్తనానికి థైరామ్ 75% లేదా కాప్టాన్ 50% 3 గ్రా విత్తనశుద్ధి చేయటం ద్వారా మరియు మాంకోజెబ్ 75% 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చు.

**పక్షుల బెడద**

ఈ పంటకు ముఖ్యంగా రామచిలుకల బెడద ఎక్కువ. వీటి నివారణకు పైరును కనీసం సామూహికంగా 20-25 ఎకరాలలో సాగు చేయాలి. మెరుపు రిబ్బనులను పైరుపైన అడుగు ఎత్తున, సూర్యరశ్మి రిబ్బనుపై పడేలా కట్టాలి. శబ్దం చేయడం, దిష్టి బొమ్మలను ఉపయోగించి పక్షులను పారద్రోలాలి.

**పైరు కోత**

పువ్వు వెనుకభాగం నిమ్మ పచ్చరంగుకి మారిన తర్వాత, పువ్వులను కోసి 2-3 రోజుల పాటు ఆరనివ్వాలి. కర్రలతో కొట్టిగాని, వలిచిగాని విత్తనాన్ని వేరు చేయాలి.

ట్రాక్టరు ద్వారా నడిచే నూర్పిడి యంత్రాలను ఉపయోగించి విత్తనాన్ని వేరు చేసుకోవచ్చు. గింజల్లో తేమ 9-10 శాతం వచ్చే వరకు ఎండబెట్టాలి.

### దిగుబడి

800–900 కిలోల దిగుబడిని నీటి పారుదల క్రింద సాధించవచ్చును.

### విత్తనోత్పత్తి

ప్రొద్దుతిరుగుడులో హైబ్రిడ్ విత్తనోత్పత్తి చేపట్టుటకు రబీ కాలం అనువైనది. విత్తనోత్పత్తి చేపట్టేందుకు సుమారు 100 మీ. వరకు ఎలాంటి ప్రొద్దుతిరుగుడు పంటలేని, నీటి సదుపాయముగల, సారవంతమైన మరియు గత సీజన్‌లో ప్రొద్దుతిరుగుడు వేయని పొలంను ఎన్నుకోవాలి. హైబ్రిడ్ విత్తనోత్పత్తి చేపట్టేటప్పుడు ఆడ మరియు మగ వరుసలకు 3:1 నిష్పత్తిలో నాటుకోవాలి. తర్వాత పొలం చుట్టూ రెండు వరుసలు మగ విత్తనాన్ని నాటాలి. పంటకాలంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఆడ మరియు మగ వరుసలలో శాఖీయ దశలో నిర్ధారిత లక్షణాల కంటే భిన్నంగా వున్న మొక్కలను ఎప్పటికప్పుడు గమనించి తీసివేయాలి. ఆడ మొక్కలలో పుప్పొడి వెదజల్లే మొక్కలను గుర్తించి తీసివేయాలి. పూతదశలో ఉదయం పూట మగ మొక్కల పువ్వు నుండి పుప్పొడిని మెత్తటి గుడ్డతో రుద్ది, అదే గుడ్డను తరువాత ఆడ మొక్కల పువ్వులపై రుద్దాలి. దీనిద్వారా ఫలదీకరణ బాగా జరిగి ఎక్కువ గింజ కట్టడానికి వీలవుతుంది. పొలం దగ్గరలో తేనెటీగలను పెంచడం ద్వారా కూడ గింజకట్టే శాతాన్ని పెంచవచ్చు. కోత సమయంలో ఆడ మరియు మగ పువ్వులను వేరువేరుగా కోసి నూర్చాలి. ఆడ మొక్కల నుండి వచ్చే విత్తనమే హైబ్రిడ్ విత్తనం. తేమ 9 శాతం వుండేటట్లు చూసుకొని భద్రపరచుకోవాలి.

- **పొలం చుట్టూ 3–4 వరుసలలో ఆవాలు విత్తుకున్నట్లయితే పొలంలో తేనెటీగల సంఖ్య పెరిగి ఫలదీకరణ బాగా జరిగి గింజకట్టే శాతం పెరుగుతుంది.**

రాస్- కృషి విజ్ఞాన కేంద్రం వారు 2016 నుండి 2020 వరకు 200 హెక్టార్లలో డి.ఆర్.యస్.హెచ్-1, కె.బి.యస్.హెచ్-44 మరియు కె.బి.యస్.హెచ్-53 హైబ్రిడ్స్ మరియు మేలైన యాజమాన్య పద్ధతులపై ప్రొద్దుతిరుగుడు పంటలో ప్రదర్శనా క్షేత్రాలను పిచ్చాటూరు, నారాయణవనం, పుత్తూరు మరియు నింద్ర మండలాలలో నిర్వహించగా హెక్టారుకు సుమారు 2070 కిలోల దిగుబడి నమోదు చేయడం జరిగింది.

# ప్రొద్దుతిరుగుడు పంటను ఆశించే తెగుళ్ళు మరియు పురుగులు



బూడిద తెగులు



పువ్వు కుళ్ళు



నెక్రోసిస్ తెగులు



శనగపచ్చ పురుగు





మొగ్గ మరియు పువ్వు దశలో ఆశించిన పొగాకు లద్దెపురుగు






రైతులకు ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం అధిక దిగుబడినిచ్చే నూతన ప్రొద్దుతిరుగుడు విత్తనాలను అందజేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు



ఎ.పి.యస్.హెచ్-66 ప్రొద్దుతిరుగుడు ప్రదర్శనా క్షేత్రం



సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై ప్రొద్దుతిరుగుడు ప్రదర్శనా క్షేత్రం



పూత దశలో బోరాన్ పిచికారి ద్వారా ఎక్కువగా గింజకట్టడాన్ని చూపుతున్న రైతు





ప్రదర్శనా క్షేత్రంలోని డి.ఆర్.యస్. హెచ్-1 ప్రొద్దుతిరుగుడు హైబ్రిడ్

కె.బి.యస్.హెచ్-44 ప్రొద్దుతిరుగుడు ప్రదర్శనా క్షేత్రం





కె.బి.యస్.హెచ్-53 ప్రొద్దుతిరుగుడు ప్రదర్శనా క్షేత్రాలు





ప్రొద్దుతిరుగుడు ప్రదర్శనా క్షేత్రాలను సందర్శిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయాధికారులు

## చిత్తూరు జిల్లా రైతాంగానికి

## రాస్-కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలు

- వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు మరియు మెలకువలపై శిక్షణా కార్యక్రమాల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం.
- పరిశోధనా స్థానాల నుండి విడుదలైన కొత్త వంగడాలు లేదా సాగు పద్ధతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం.
- నూతన వంగడాలు మరియు సాగు పద్ధతులపై రైతుల పొలాల్లో ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహించి ప్రాచుర్య పరచడం.
- గ్రామీణ మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించడానికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం.
- గ్రామీణ మహిళలకు ఆరోగ్య మరియు పోషణ స్థితి మెరుగు పరిచేందుకు గ్రామ స్థాయిలో లభించే ఆహార ఉత్పత్తులతో వివిధ పోషకాహారాల తయారీ పై అవగాహన మరియు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం.
- వ్యవసాయ మరియు ఇతర అనుబంధ రంగాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం పై జిల్లా విస్తరణాధికారులకు శిక్షణ నిర్వహించడం.
- వాతావరణ పరిస్థితులు, పంటలను ఆశించిన పురుగులు మరియు తెగుళ్ళపై హెచ్చరించి వాటి నివారణ చర్యలను ఎప్పటికప్పుడు సందేశాలను మొబైల్ ఫోన్ ద్వారా రైతాంగానికి చేరవేయడం.
- భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు నేల ఆరోగ్య పత్రాలను ఇవ్వడం.
- విజ్ఞాన యాత్రల ద్వారా రైతులకు ఆధునిక పరిజ్ఞానం పై అవగాహన కల్పించడం.
- కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేసే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలియజేయడం.

సంకలనము
డా. వి దివ్య, సేద్య విభాగం

సహకారం
టి. రాము కుమార్, విస్తరణ విభాగం

పర్యవేక్షణ
డా.యస్. శ్రీనివాసులు, సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్

ప్రచురణ: 2021-22

ప్రతులు: 2000